# ఆమె నీడ

ఇవన్నీ రాజారావుకి సంభవించాయి జరిగిందిదీ - నమ్ము నమ్మకపో అని జరిగిందంతా చెప్పి ముగించాడు.

నేను నమ్ముతాను. ఎందుకంటే అదంతా దేన్నో సమర్థించేటందుకు చెప్పింది కాదని స్పష్టమైంది. దానికంతటికీ చమత్కారంగా ఏదో వ్యాఖ్యానం చేస్తే తప్ప చటుక్కున స్ఫురించే అర్థం లేదు. అపూర్వమైన సంగతులు జీవితంలో తటస్థపడటం అందరికీ అనుభవమైనా, కళలో వాటిని మనం నమ్మలేం. కళలో ప్రయోజనం, విలువలు - వీటితో మనకి నిమిత్తం వుంది గనక అపూర్వమైన సంఘటనకి ప్రముఖస్థానం లేదు. కల్పితమైన వాటికన్న జీవితంలో నిజంగా జరిగేవే ఎక్కువ ఆశ్చర్యాన్ని కలిగిస్తాయన్న నిర్వచనం యిదే చెబుతుంది. వాస్తవిక సంఘటన కలగజేసే ఆశ్చర్యానికి కళలో తావులేదు - దాని కేదో ప్రయోజనమూ, అర్థమూ, ఔచిత్యమూ వుంటేతప్ప ఇవన్నీవుంటే అసలంత ఆశ్చర్యమే కలగదేమో కూడా!

అనుభవానికి తుది మొదలు, కారణాలు కొంతవరకూ వూహించవచ్చు. ఈ ఊహ మటుకు సక్రమంగా కొనసాగకపోతే, అనుభవాన్ని చిత్రించినవారిని విమర్శించాలి గాని, అనుభవాన్నే శంకించకూడదు. రాజారావు పరిస్థితులు కొంతవరకూ నాకు తెలుసు. సంసారభారం పైనబడి ఇంటర్‌తో చదువు చాలించి ఉద్యోగం కోసం యత్నాలు చెయ్యాల్సి వొచ్చింది. అనువైన వుద్యోగం దొరకడంలేదు. ఏదో వో వుద్యోగం - ఏ వుద్యోగమైతేనేం- పొట్టపోసుకోడానికీ, ఆదర్శసాధనకీ సంబంధం ఏమిటి? - అనుకునే స్థితి కొచ్చాడు. భార్య, పెండ్లి, సంసారం - వీటి యథార్థాన్ని ఎదుర్కొనే చైతన్యాన్ని పరామర్శ చేస్తుండగానే వివాహమైపోయింది. భార్య సీత - ఎంతో మంచిది, అమాయకురాలు. వ్యక్తిత్వంలో సర్వస్వమూ వొక్కచూపులో స్వాధీనం చేసేలా చలించని నిండుచూపు, సన్నటి ముక్కు వింత భావాలని ప్రకటించే మాటలకు అలవాటుపడని పసిపెదవులు, - సీత ఎదురుగా వున్నాకూడా ఆమె దూరంగా వుండగా తల్చుకున్నప్పుడు కలిగే జాలి జ్ఞాపకాలొస్తాయి. అత నెవరో! ఆమెవరు? వారిద్దరూ భార్యాభర్తలా? వారేంచెయ్యాలి? వారేం కావాలి? రాజారావుకివేవీ అర్థంకావు.

అందరు విద్యార్థులవలె అతను ఊహాజగత్తులో విహారం విరమించలేదు. ఆ జగత్తుకి మనస్సుతో ప్రమేయం లేదు. శరీరంతో యింక దెబ్బలాడలేక యౌవనం మనస్సుని దిగవిడిచి స్వప్న జగత్తులోకి పారిపోతుంది. శృంగారం వొక సరస్సు, ఆదర్శాలు చుట్టూ కొండలు; మధుర స్వప్నం వొక మొగ్గ; ఆమె నవ్వు వికసించిన పుష్పం; ఆనందబాష్పాలు జలపాతాలు; యౌవనం నావ - అతడు నావికుడు. ఆమె ఎవరు? భార్య సీత కాదు.

ఎవ్వరూ లేరు. ఈ జగత్తులో అన్నీ వున్నాయి. ఒక్క ప్రేమ తప్ప. ఆమెని పిలిచాడు. జవాబు లేదు. కూర్చుని ఏడుస్తున్నాడు.

'పోస్టు టైమయిందేమో, మరి దరఖాస్తు పంపరూ?' ఎదురుగుండా సీత.

చుట్టూ శిఖరాలు విరిగిపడ్డాయి. మొగ్గలు ముడుచుకున్నాయి. పువ్వుల రేకులు గాలిలో ప్రకృతి తుమ్మినట్టుగా కొట్టుకుపొయ్యాయి. నావలోకంత – అతను మునిగిపోతున్నాడు.

లేచి దరఖాస్తు కవర్లోపెట్టి పోస్టాఫీసు కెళ్ళాడు. అతను వెళ్ళగానే సీత తలగడదిండు సర్దింది. దిండ్లకింద పుస్తకం. పుస్తకంలో ఫిలింతార ఫోటో. ఆమె అమాయకంగా నవ్వింది.

ఇంట్లో భోజనం, నిద్ర – తరవాత బైట రోడ్లమ్మట నడుస్తూ, ఆలోచిస్తూ పోతూండడం – అల్లా గడిచిపోతున్నాయి రోజులు. అతనికి బైట బాగాలేదు. ఇళ్ళముందు మురికి కాలువలు; పందులు, గాడిదలు – వాటిదెంత ప్రశాంత జీవితం! దుకాణాలు – ముష్టివాళ్ళు, కుష్టువాళ్ళు, దూరంగా గుడిసెలు, ఎండ లేకపోతే వాన, ఆ జనం, ఆ వాసనలు, ఆ దుమ్ము'– ఛ, ఛ, ఇవే నయం. కొన్నివేల సంవత్సరాల క్రితం సిద్ధార్థునికి కలిగిన అసంతృప్తే అది.

అన్ని మూలలా పరకాయించి చూశాడు, ఆ మాసిన బట్టలబుట్ట దాని కింద బొద్దింకలు, ఎలుకలు. ఆ చూరంతా బూజు, సాలిగూళ్ళు, చచ్చిన కీటకాల కళేబరాలు. ఆపాతకుర్చీ మేకులు వంకరగా పైకొచ్చి వీలైనప్పుడల్లా లేచినవారి బట్టలని చించుతున్నాయి. 'ఇస్, అబ్బ!' – గాలి, వెలుతురు చాలవు. పగలల్లా ఈగల సముదాయాల స్వేచ్ఛాకేళి; రాత్రల్లా దోమల బృందగానం. సాముదాయక ఖడ్గ నృత్యాలు, ఆ గోడగడియారం తిరగదు; అబ్బబ్బ – ఏదేనా భరించొచ్చు, ఈ చెమట నెల్లా భరించడం! ఒళ్ళంతా చెమటలు పట్టే ఏర్పాటెందుకూ? శరీరంలో ఏదో ఓ భాగాన్ని చెమటకి కేటాయించకూడదూ సృష్టికర్త!

రాజారావుకి సీతపై, తనపై, తనని పుట్టించిన తల్లిదండ్రులపై, వారిని షోషించిన సమాజంపై, సమాజానికి తావిచ్చిన దేశంపై, సముద్రాల ద్వారా ఏకంచేసిన యీ గోళంపై ఈ నిర్భాగ్య గోళాన్ని తనచుట్టూ తిప్పుకుంటున్న సూర్యబింబంపై – ఆగ్రహమొచ్చింది. బైటకెళ్ళాడు. ఏవో ఆలోచిస్తూ నడిచిపోతున్నాడు.

మానవహృదయం అంత విశాలమైందంటారు. ఊహకు అంతం లేదంటారు. అయినా అతనివి అవే ఆలోచనలు. పాతవే. ఎన్నిసార్లో సాగించిన వూహలు. కొత్తవి కనబడవు. మళ్ళా మళ్ళా మొన్న చూసిన సినిమాలో దృశ్యాలే వూహలో మెదిలి అతన్ని కలవరపరుస్తున్నాయి. కథానాయకుడు తనంత బాగుండడు; తనంత చదువుకున్నవాడు కాడు; అస లతని చదువు, వుద్యోగం విషయం అందులో లేదు. హాయిగా టెన్నిస్ ఆట ముగియగానే కార్లో సరోజ యింటికెడతాడు. సరోజ తండ్రికేం పనో తెలీదు. వాళ్ళిల్లు ఎంత బాగుంటుంది! గేటు – మొక్కల పార్కు, పోర్టికోముందు నగ్నంగా స్నానం చేస్తున్న స్త్రీ విగ్రహం –పెద్దహాలు – ఎక్కడ చూసినా సోఫాలు, సెట్టీలు, వూగే కుర్చీలు, ఏమరిపాటుగా కూలబడితే గజంపైకి విసిరివేసే స్ప్రింగులు, కుషన్ల కుర్చీలు; పైన వ్రేళ్ళాడే 'చాండిలియర్లు' – బెల్జియమ్ గ్లాస్‌తో చేసిన దీపాలగుత్తులు, బ్రాకెట్ లాంప్‌లు 'వెస్ట్‌మినిస్టర్'

సంగీతంతో గంటలు మ్రోగే 'కీంజిల్' గడియారాలు, 'ఏపోల్లో' దేవత కంచువిగ్రహం చేతిలో మరో రంగుదీపం, గోడలనిండా బొమ్మలు – గోల్డ్‌ఫ్రేమ్‌లో తైలవర్ణ చిత్రాలు – ఆరువేల మెట్లుగల స్టెయిర్ కేస్‌మీద పెర్షియా తివాచీ – మెట్ల మొదట్లో ఎలబాస్టర్ రాతిలో చెక్కిన ఇద్దరు స్త్రీ మూర్తులు; ఎంత సౌందర్యం! ఎంత సౌఖ్యం! సరోజ మేనమామ ఇంగ్లీష్ నైట్‌గౌన్లో, హాలండ్ 'పైప్' పీలుస్తూ క్షణం దర్శనం యిస్తాడు 'షెల్లీ చైనా' టీ కప్పు చేతులో పట్టుకుని – పక్కన అల్‌సేషియన్ కుక్క – దూరంగా గుమ్మంలో వంటాయన. సరోజ ఆనందంతో అద్దంముందు కాసేపు నాట్యంచేసి, పాట పాడుకుంటూ సింగారించుకుని సినిమాకని చెప్పి కార్లో వెళ్ళిపోతుంది.

సరోజ తోటికోడలు, తన సీతలాగ పూర్వకాలపుది. తన గదిలోంచి బైటకి రాదు. ఆమె ఎప్పుడూ పూజామందిరంలోనే, భగవంతుడి ప్రతిమముందు నాట్యంచేస్తూ, పాడుకుంటూ వుంటుంది. కాని ఎంత అందమైన గది! దుర్గ, కృష్ణుడు, ఆంజనేయులు, సరస్వతి, వినాయకుడూ, కాళి – యివన్నీ, దంతపుబొమ్మలు. లోహపు చిత్రాలు. పైన బుద్ధుని ప్రతిమ. ప్రక్కనే 'మహాత్ముడు' ఫొటో. మరో గోడమీద రామకృష్ణ పరమహంస, శివాజీ – మధ్యలో శివాజీ ఎందుకో? – కాళికాదేవి ప్రసన్నమైందటగా!

అంత అందమైన పూజామందిరం త నెవ్వరింట్లోనూ చూడలేదు. తెల్లటి మెత్తటి మెరిసిపొయ్యే ఆ గోడలు ఎక్కడా అట్లాంటివి చూడలేదు. తను చూసిన యిండ్ల గోడలనిండా ఏవో కాగితాలు, బొగ్గుతోనో, యిటుకతోనో వ్రాతలు, మీసాలు తగిల్చిన ఆడబొమ్మలు, ఫలానావారికి వోటిమ్మని వ్రాతలు, బూతులు – సినిమాలో యిండ్ల గోడలకి యివేవీ వుండవు. అతనికి పరిసరాలపై రోత ప్రబలడానికి కారణం ఈ సినిమాలో సృజింపబడిన సౌందర్య దృశ్యాల జ్ఞాపకాలే!

రాజారావు వూరవతల పార్కుదాటి, నరసింహస్వామి ఆలయపావరణకి చేరుకున్నాడు. నవ్వొచ్చింది. సినిమాలోవన్నీ సెట్టింగులు – ఎక్కడెక్కడినుంచో ఆ వస్తువులన్నీ సేకరించి, అమర్చినవి జీవితం అంత అందంగా వుండాలని – వుండేటట్టు చేసుకోమనీ వాటి వుద్దేశం. అల్లా ఎవరేనా వున్నారా? ఏమో వున్నారేమో! తనకేం తెలుసు? ఎక్కడా లేకపోతే మాత్రం అల్లా ఎందుకు చూపుతారు? సరోజగారింట్లో పనిపిల్ల ఎంతందంగా వుందని! తోటలో వెన్నెట్లో నృత్యాలు; చిన్నయ్యగారు ఆమె కేసి ఓ క్షణం చూసినందుకు ఈ ఆనందం. మరి తనింట్లో పనిచేసే అప్పి?' మసిబొగ్గు రంగు; మురికి వాసన. జుట్టుకి నూనెకూడా రాసుకోదు; పాచిలో జారిపడి రాచిప్ప ముక్కలు చెయ్యడం తప్ప, దానికి వేరే నృత్య భంగిమాలు చేతకావు.

రాజారావు ఆలయంలోకి వెళ్లేవారినీ, వొచ్చేవారిని చూస్తూ కూర్చున్నా – వూహని విడమర్చి, వేరే ఆంతరంగికమైన ఆలోచనలు చేస్తూనే వున్నాడు.

ఆలయంచుట్టూ విద్యుద్దీపాలు, చుట్టుప్రక్కల దుకాణాలలో మెర్క్యురీ దీపాలు. ఆలయం కుడివైపున 1857 స్వతంత్ర సమరంలో ప్రాణాలు త్యాగం చేసిన వీరుల స్మృతి చిహ్నంగా కొత్తగా నిర్మాణమైన మందిరం; మందిరం మధ్యలో ధర్మచక్రం. విద్యుద్దీపాల వెలుగులో గోడలు తెల్లగా వెండిని రేకుగా మార్చి ముసుగేసుకున్న వెన్నెలలాగ మెరిసి

పోతున్నాయి. ఆలయంచుట్టు వెళ్ళే జనంనీడలు ఆ గోడలమీద నల్లగా, కాలం చిత్రించిన బొమ్మలలాగ ప్రస్ఫుటంగా కనబడి, కదిలిపోతున్నాయి. వెండితెరమీద చూసిన నల్లబొమ్మలు స్మరణకొచ్చాయి. సినిమాలో అప్పుడప్పుడు నాయికా నాయకుల ప్రక్కకు తిరిగిన మొహాలు, తెల్లటి శూన్యంముందు, నల్లగా 'సిల్యుయట్'లో అలాగే చూపుతోంటారు. దగ్గరగా ఉన్న వ్యక్తుల ఆకృతులు మరింత పెద్దవిగా ఆ గోడ మీద పడి, చోటు చాలక, కాళ్ళనీడలు మాత్రం కనబడి, కదిలిపోతున్నాయి. దూరంగా ఉన్న వ్యక్తుల పూర్తి బొమ్మలు పడుతున్నాయి. రాజారావు వంతెనమీద కూర్చుని, గోడమీద పడుతూన్న నీడలకేసి చూస్తున్నాడు. అడుగో ఎవడో కుర్రాడు సైకిల్‌మీద పోతున్నాడు. ఈయన ఎవరో మీసాలు, పాగా – తలకాయ మాత్రం కనుపిస్తోంది. కదిలిపొయ్యాడు. ఎడ్లబండి కాబోలు, ఎడ్లకాళ్ళు, బండి చక్రాలు కనిపిస్తున్నాయి. గుళ్ళోంచి జనం ఒక్కసారిగా బైటికొచ్చారు. అన్ని తలకాయలు కలసిపోయి – వారి నీడలు తెరవెనుక అస్థిపంజరాల నృత్యంలాగ ఒకదానిలో ఒకటి కలిసిపోయి – కెరటంపై తుంపరలలాగ విడిపోయి సాగిపోతున్నాయి. జనం పల్చబడ్డారు. ఉండి ఉండి ఏదో ఒక నీడ కదుల్తోంది. గోడంతా తెల్లగా వెండితెరలాగ, నీడల చలనంలేక నిశ్చలంగా ఉంది. అప్పుడు గోడమీద ఒక సౌందర్యమూర్తి నీడ చూశాడు. ఆమె మెడ, తల గోడంతా ఆక్రమించాయి. ఒక్కక్షణం ఆ నీడ నిలిచింది. చెవుల లోలాకులు కదలడంమాని నీడలో కలసిపొయ్యాయి. జడ మెడమీద పడింది. ఆ రెంటిమధ్య 'డైమండ్' ఆకారంలో ఏర్పడ్డ ఖాళీ తెల్లగా కన్పడుతోంది.

విరిచిన విల్లులాగ తీర్చిన అవయవాల అమరిక, ఎవరో విరిచిన కాడలులాగ కనురెప్పలు; గుండ్రంగా ప్రారంభమై, చదరంగా అంతిమొంది సగంతీసిన చాకులాగ, వొరిగి నిలచిన ముక్కు సమంగా ఉన్న రెండు పెదవులు, సిగ్గుతో వొంగి చోద్యం చూచే కుతూహలంతో ఒక్కసారి వొయ్యారంగా, బైటికి గెంతి, మళ్ళా భయంతో చరచరా లోపలికి వెళ్ళిపోయినట్లు, వొంపు తిరిగినగెడ్డం – ఆ శ్యామలమూర్తి నీడ సొంపుకి, అతడు ముగ్ధుడైపొయ్యాడు. ఏవేవో ప్రతిమలు, చిత్రాలు, ఫిలింతారల ఛాయలు, చరిత్రలో కలిసిపోయిన సుందరాంగనల ప్రతిబింబాలు అతనిని కలవరపర్చినవి. నీడను ప్రేమించడం నూతన అనుభవం. అతడు దానికి లొంగిపొయ్యాడు. దూరంగా ఊరేగింపు ధ్వనులు మీదకొచ్చి పడుతున్నాయి. వొచ్చేశారు. ఆ శ్యామలమూర్తి ఆ నీడలమధ్య నలిగి కరిగి పోయింది. ఎన్నో నీడలు – ఆకృతి కాదు, నల్లగా గోడంతా క్రమ్మేశాయి. ఆమెకోసం వెనక్కి తిరిగి చూశాడు. అంతా ఊరేగింపు జనం గబగబా త్రోసుకుంటూ వెడ్తున్నాడు. ఆమె కనపడలేదు. గుంపు దాటాడు. జనం పల్చబడ్డారు. కుడివైపు సందులోకి మళ్ళాడు. ఎక్కడా మనుషుల అలజడి లేదు.

దీపం నీడలో దూరంగా ఉన్న మేక. ఎవరో పులిస్తరాకులు గిరవాటెట్టారు. సందుదాటి పార్కువైపు కొచ్చాడు. ఆమె ఏమైంది? ఆమె నిజంగా ఉందా? తన మనసులో భ్రమలు ఆ నీడరూపం దాల్చినవా? తనని పరీక్షించడానికి దేవతలు కల్పించిన మాయా రూపమా? అలసటతో అసంతృప్తితో చెమటల్లుపోశాయి. ఆ బెంచీమీద కూర్చున్నాడు. చొక్కా బొత్తాములు విప్పాడు. సోడా కొట్టించుకు త్రాగాడు. కళ్ళుమూసుకుని పరున్నాడు.

రెప్పలక్రింద ఆమెనీడ నల్లగా వొత్తిడి చేసింది. అతనికేదో అపూర్వ సౌందర్యం దొరికింది. కాని దాన్ని ఉంచుకోలేదు. కదిలిపొయ్యే జీవితంలాగ కరిగిన స్వప్నంలాగ, ఉండికూడ లేని ఇంద్రజాలం, ఎండ మావి. నడచినకొద్దీ దూరమయ్యే ఇంద్రధనుస్సు.

ఏదో పురుగు చొక్కాలోపల కదిలింది. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. దిగాలుగా నడిచి ఇంటికి చేరుకున్నాడు. పదిగంటలు కావొస్తూంది.

"సినిమా కెళ్ళారా?" సీత ప్రశ్నకి లేదన్నట్లు తల పంకించి, భోజనానికి కూర్చున్నాడు. భోజనాలదగ్గర ఎవరూ ఏమీ మాట్లాడలేదు. భోజనాలయ్యాయి. అతడు అరుగుమీద ఏకాంతంగా కూర్చొని ఆకాశంకేసి చూస్తున్నాడు. ఇంతలో లైట్లు పొయ్యాయి. కొవ్వొత్తి వెలిగించి గదిలో పెట్టి సీత బైటికొచ్చింది.

'ఏమండి; దిగులుగా వున్నారేం?'

సమాధానం లేదు.

'ఉద్యోగం విషయమా? అదే వొస్తుంది.... కాలం కలిసిరావాలి. చెప్పరూ....'

'ఏమీలేదు.... ఊరికినే....'

'ఏదో వుంది. నాతో చెప్పకూడదా....?'

'నీ కర్థమవదు.'

'అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తాను" అంది సీత.

'నాకేం దిగులుగా లేదు. మనస్సంతా అదోలాగుంది; ఫలానా కారణం అని లేదు.'

'పోనీలెండి చెప్పకపోతే, ఇంకెప్పుడూ అడగనులెండి.'

దూరంగా కొవ్వొత్తి వెలుగులో ఆమె కళ్ళల్లో తడి మెదిలింది మృదువుగా. ఆమె నీడ వికృతంగా స్తంభంమీదపడి గాలికి కదులుతోంది. ఆమె ముఖాన్ని పైకెత్తి కళ్ళల్లోకి చూశాడు.

'ఊరికినే.... కోపం వచ్చిందా?'

లేదన్నట్లు తలవూపింది.

'నవ్వితే చెబుతాను.'

దట్టమైన వర్షం మధ్యకాసేపు సూర్యుడికాంతి ధారలమధ్య కొట్టుకున్నట్టు సీత నవ్వింది. నీడ స్తంభంమీద వొంకరలు తిరిగింది.

'చెప్పనా?'

'ఉ' అన్నట్లు మూతి ముడిచింది.

'నే నొకర్ని ప్రేమించాను' అన్నాడు రాజారావు.

'నిజంగా'?

'అవును.'

ఎవ్వరూ మాట్లాడలేదు కొవ్వొత్తి వెలుగులో కీటకాలు రెక్కలు విరుచుకుంటున్నాయి. ఏదో పురుగు టప్పుమని గోడమీద పడింది.

చాలాసేపైంది.

'ఎవర్ని?' అంది సీత.

'నిన్నే' అన్నాడు.

ఆమె నవ్వింది – వింతగా నీడ కూడా నవ్వింది.

'వేళాకోళమా?'

'ఎందుకు కాకూడదూ?'

'నే వెళ్ళిపోతానంతే' అని, జడ ముందుకి లాక్కుని పూలగుత్తిని చేతులోకి తీసుకుంది.

ఆనాడంతే సంభాషణ. కాని రాజారావు వూహలో ఆమెనీడ అల్లానే నిల్చిపోయింది. ఉద్యోగంకోసం పడే అవేదనని త్రోసి, తనే మనస్సులో ప్రధానస్థానం ఆక్రమించు కుంటోంది. అతనిలో దిగులు ప్రబలమైంది. దేనివల్లనో – ఉద్యోగం కోసమా, ఆమె నీడ దొరకలేదనా అతనికే తెలీడంలేదు.

రోజూ ఆలయంవేపు వెళ్ళి ఆ మందిరం గోడమీది నీడల్నిచూస్తూ గడిపేవాడు. ఆమెనీడని ప్రసరించిన వ్యక్తి అతనికి కనబడలేదు. ఈ జగత్తంతా మాయగ కనబడసాగింది. మనుషులంతా నల్లగా, నీడలలా కనబడసాగారు. నల్లటి బాధ అతనిలో నిండుకుంది. చరిత్ర కంతలు, తలుపులు గుహల బీటలు మూసుకుంది. అంతా చీకటి. గతం అంతా తెల్లటి తెర; వర్తమానం ఒక పెద్దనీడ. భవిష్యత్తులేదు.

కొన్ని రోజులైం తరాత్వ సీత మళ్ళా అడిగింది.

'మీరీ మధ్య అదోలా వుంటున్నారు. కారణం చెప్పరూ?'

'వెనక చెప్పాను. వేళాకోళమని తోసేశావు' అన్నాడు.

'నన్ను ప్రేమించడమేమిటి లేకపోతేను!' అన్నది సీత.

'భర్త భార్యని ప్రేమించాడంటే హాస్యాస్పదంగా వుంటుందెందుకో?' అన్నాడు.

'ప్రేమ కొంతకాలం వుండిపోతుంది. దాంపత్యం ఎప్పుడూ వుండేది అంటారుగా పెద్దలు' అన్నది సీత. ఆమెకేసి తేరిపారచూశాడు. తను అనుకున్నంత అమాయకురాలు కాదేమో సీత. ఆమెపై గౌరవం పెరిగింది. గౌరవం పెరిగినకొద్దీ ఆమె దూరమైపోతున్న ట్లనిపించింది. మంట వెలుగిస్తుంది. వేడినిస్తుంది. కాని వేలుపెడితే కాలిపోతుంది.

'ఎవర్నో చెప్పండి – నే నేమీ అనుకోను'

'నువ్వు వూహించలేవా?'

'లేను.'

'ఒకామె నీడని....'

సీత నవ్వింది – మెల్లిగా ప్రారంభమై, చప్పుడు లేకుండా, ఎంతో సేపు మొహంమీద వ్యాపించి, మళ్ళా పెదవులమూతలో దాగిన నవ్వు.

'అందుకనే నీ కర్థంగాదు – అన్నాను' అన్నాడు రాజారావు.

'మరి నవ్వనులెండి. ఎవరినీడో?'

'గోడమీద పదిరెట్లు పెద్దదిగా పడింది ఆమెనీడ. వెనక్కితిరిగి చూశాను. ఆమె లేదు. ఏదో వూరేగింపు గుంపులో కలిసిపోయిందో, మరెటుపోయిందో. ఆమెను చూసేవరకూ నాకు తోచడంలేదు. ఈ అన్వేషణ వొక పరమావధిగా పరిణమించింది' అన్నాడు. సీత

మొహంతిప్పి గోడకేసి చూసుకుంది. రాజారావు నీడతో కలిసి, ఏదో ముసుగులా, ముద్దలా పడింది ఆ నీడలద్వయం.

సీత ఈ విషయం అంతగా పట్టించుకోలేదు. ఏదేనా సందర్భం దొరికినప్పుడు, దెప్పిపొడిచేటంతవరకే జ్ఞాపకం పెట్టుకుంది. దెప్పిపొడుపుకి వొకటి రెండుమార్లు రాజారావు చీకాకుపడటం చూసి, అదీ మానేసింది. వారాలు గడిచాయి. అతనల్లా తిరుగుతూనే వున్నాడు. ఆమెనీడ మూర్తీ కనబడలేదు; ఉద్యోగమూ దొరకలేదు.

ఓ వుద్యోగంకోసం రాజారావు పట్నం వెళ్ళాల్సి వొచ్చింది. మొదలియార్ ఆఫీసులో అభ్యర్థుల పరామర్శ. ముందుగానే యింటికెళ్ళి ఆయన్ని చూడాలనుకొని, ఓ డజన్ యాపిల్ పండ్లు సంచీలో వేసుకొని మొదలియార్ యింటికి చేరుకునేటప్పటికి. సాయంత్రం ఏడు కావొస్తోంది. ఆయన క్లబ్బునుంచి యింటికి చేరుకునేవేళ అది. చుట్టూ గోడ. మధ్య గేటు. గేటులోంచి లోపలి కెళ్ళాడు. ముందంతా తోట – పెద్దచెట్ల గుండా దోవ దాటింతర్వాత చిన్న మొక్కలు. వరండాలోకి మెట్లు. వాటిముందు రెండు పెద్ద విద్యుద్దీపాలు. ఆ కాంతికి మొక్కల నీడలు ఎదురుగావున్న గోడమీద స్ఫుటంగా పడుతున్నాయి. గోడలమీద నీడలకేసి చూడటం అలవాటైపోయింది. ఆ నీడల కేసి చూస్తున్నాడు. మొక్కలు పదిరెట్లు పెద్దవిగా పడుతున్నాయి. చలనంలేదు. ఇంతలో వో కుక్కపిల్లనీడ పడింది తోక అడిస్తూ గంతులేస్తోంది. ఆ నీడ కదిలిపోయింది. దాని వెనకాల మరో స్త్రీ తలనీడ పడింది. నీడ నిలిచింది, మెడ, తలమాత్రం పెద్దగా కనుపిస్తున్నాయి. లోలాకులు కదిలి నిలిచిపొయ్యాయి. జడకి మెడకి మధ్య డైమండ్ ఆకారం ఖాళీ తెల్లగా కనబడుతోంది. ఇదే ఆమెనీడ. గుండ్రంగా ప్రారంభమై, చదరంగా అంతమొందిన నుదురు. విల్లువిరిచినట్లు పెదవులు, వొంచిన కత్తిలా ముక్కూ వొంకరలు తిరిగిన గడ్డం – ఆమెయే! అమ్మయ్య ఇన్నాళ్ళకి చూడగలిగాడు. అదుర్దాతో గుండెలు కొట్టుకుంటున్నాయి.

ఇంతలో కుక్కపిల్ల మొరిగింది. ఉలిక్కిపడి నాలుగడుగులు వెనక్కివేశాడు. కుక్కపిల్ల అతని చుట్టూ తిరుగుతోంది. చిటికెలువేస్తూ, 'టిబ్బీ' అని పిలుస్తూ, ఆమె మొక్కల మధ్యనుండి అతనివేపు నడిచి, చూడగానే నిలిచిపోయింది.

'ఎవరికోసం?' అంది ఆమె.

'మొదలియార్‌గారి కోసం.'

'ఇంకా రాలేదు. మీరెవరు?'

ఫలానా వూరని చెప్పాడు. ఉద్యోగం విషయంలో వారి దర్శనం కోసం వొచ్చినట్లు చెప్పాడు.

'అల్లా వరండాలో కూర్చోండి. ఈపాటికి వస్తూవుంటారు' అన్నదామె.

'మీ రెప్పుడేనా మా వూరొచ్చారా?'

'లేదు.'

'ఎప్పుడూ?'

'లేదు. ఎందుకు?'

'ఊరికినే. అంటే.... ఊరికే అడుగుతున్నాను.

'లేదు లేదు' అని ఆమె నవ్వింది.

కుక్కపిల్లతో లోపలి కెళ్ళింది. ఇంతలో మొదలియార్‌గారి కారు హారన్ మ్రోగింది.

దిగులుపడ్డాడు రాజారావు. ఆమె అటుకేసి రాలేదు. కాని అచ్చంగా ఆమె నీడలాగా వుంది. దానితో ఎందుకు తృప్తిపడకూడదూ. ఆమెనీడ వ్యక్తినే చూడాలి. మళ్ళా చీకటి అలుముకుంటోంది.

ఉద్యోగం పరామర్శ అవగానే రాజారావు తన వూరికి చేరుకున్నాడు. రోజూ సాయంత్రం ఆలయం కేసి వెళ్ళి ఆ నీడలని చూస్తూ కూర్చునేవాడు. మూడువారాలు గడిచిం తర్వాత అతనికి ఉద్యోగం వొచ్చినట్లు ఉత్తరం వొచ్చింది. సీత సంతోషంతో పొంగిపోయింది. ఈ వార్త విన్న 'అప్పి - పనిపిల్ల' కూడా నవ్వింది. రాజారావుకి సంతోషంగా వున్నా వీళ్లెవ్వరూ నృత్యం చెయ్యనందుకు ఆశ్చర్యపడ్డాడు. తన వైఖరికి తాను నవ్వుకున్నాడు. సంతోషాన్ని బైటకు ప్రకటించడం ఎట్లా? అందుకనే సినిమాలో ఆనందాన్ని నాట్యంగా వ్యక్తం చేస్తారు. కళలో మరోమార్గం లేదు. అదొక సాంకేతిక ప్రదర్శనం. ఈ మాత్రం తెలీ దతనికి! సినిమాలో నృత్యంచేసిన పనిపిల్ల, పెద్దకుటుంబంలో పిల్ల అని చివ్వరిలో తెలిసిపోయిందిగా.

ఆమెనీడ స్ఫురణకొచ్చినప్పుడల్లా దిగులుపడేవాడు. ఆ సాయంత్రం ఆలయం కేసి వెళ్ళాడు. ఆ వంతెనమీద కూర్చుని, మందిరం గోడమీది నీడల్ని చూస్తూ కూర్చున్నాడు. తనకింక యీ గోడకేసి చూసే అవకాశం లేదు. మరోవూరు వెళ్లి వుద్యోగంలో చేరాలి నీడలు భయంకరంగా కదులుతున్నాయి. పల్చబడ్డాయి. సైకిళ్ళు రిక్షాలు, బండ్లు, ఆవులు, పోలీసు - యివన్నీ కదిలిపొయ్యాయి. గోడ తెల్లగా నీడలు లేకుండా వుంది. మనుషులు పల్చబడ్డారు. సోడా కొట్టిన చప్పుడు. దూరంగా గుడిగంటలు. మేక అరుపు. కుర్రాడి యీలపాట గోడమీద ఒక స్త్రీతల పడింది - పదంతలు పెద్దదిగా. ఆనాడు చూసిన ఆమెనీడ - లోలాకులు కదిలి నిలిచిపొయ్యాయి. జడకి మెడకి మధ్య డైమండ్ ఆకారంలో ఖాళీ, గుండ్రంగా ప్రారంభించి చదరంగా అంతమొందిన నుదురు, వొంచిన కత్తిలా ముక్కు, వంకరలు తిరిగిన గడ్డం. వెనకాల మరో స్త్రీ నీడ పడింది. కదిలిపోతున్నాయి. ఆలస్యంచేస్తే అంతర్ధానమౌతాయి. చటుక్కున వెనక్కి తిరిగి చూశాడు. భార్య సీత, వెనకాల పనిపిల్ల 'అప్పి'.

'ఆలయాని కొచ్చాం. ఉద్యోగం రావాలని మొక్కుకున్నాను. మీరూ రండి' అన్నది సీత.

'అప్పి' వెర్రిగా నవ్వింది.

'ఆమె నీడ దొరికింది' అన్నాడు.

'ఎక్కడ?'

'అటుచూడు?

చూశారు. అప్పి నీడ కనబడుతూంది.

'అప్పి నీడా?'

'ఛ, ఛ.'

'మరి' ఆశ్చర్యంగా చూసింది సీత.

'నీదే.'

'నా కేమీ కనపడ్డం లేదే!'

'మనం గోడకి మరీ దగ్గరగా వున్నాం – అప్పి కొంచెం దూరంగా వుంది.'

'ఎవరేనా చూస్తే నవ్వుతారు. రండి వెడదాం.'

మనం దగ్గరగా వచ్చినకొద్దీ దూరమయ్యే నీడ అది అన్నాడు రాజారావు. తనకి తెలీకుండానే ఒక జీవిత సత్యాన్ని తను ఋజువు చేసుకొని ఒక్క వాక్యంలో యిమడ్చగలిగాడు.

అపూర్వమైన అనుభవానికి అర్థాలు కల్పిస్తే మరింత అసహజంగా ధ్వనిస్తుందన్న భయంతో యీ గాథను ముగిస్తున్నా.

**రచనాకాలం: 1940 నవంబరు 1**
**ప్రచురణ: గృహలక్ష్మి, 1940, డిశంబరు**